www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024
5
ఏలూరు



రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు
పలువురి అభినందన

కొయ్యలగూడెం :రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కొయ్యలగూడెం మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన త్రోబాల్ సెలక్షన్స్ పోటీల్లో తమ హై స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని రాజవరం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం బి.రామారావు తెలిపారు. ఎస్.పూజిత, ఎన్.గణేష్, నందకిషోర్, జె.హేమంత్‌కుమార్, జి.అఖిల్‌కుమార్‌లు అండర్-17, అండర్-14 విభాగాల నుంచి ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా అండర్-17 విభాగం నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొయ్యలగూడెం బాలుర హై స్కూల్ కి చెందిన పి.నాగబాబు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.సుజాత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీలు ఎంవి.సుధాకర్, జె.శ్రీనివాస్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

'చింత'లపూడి గాడిన పడేనా..!

గత ప్రభుత్వ హయాంలో పడకేసిన చింతపూడి ఎత్తిపోతల పనులు

4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరం

అధికారంలోకొస్తే 'చింతలపూడి' పూర్తిచేస్తామంటూ కూటమి హామీ

నాలుగు నెలలైనా పనుల్లో కదలిక లేని పరిస్థితి

నవంబర్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించేనా?

భూములిచ్చినా రైతుల సమస్యలకు పరిష్కారం లేకుండాపోయే



చింతలపూడి ఎత్తిపోతల కాలువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభంపై మెట్ట ప్రాంత రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. గత ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకున్న పాపాన లేకుండా పోయింది. దీంతో రైతాంగానికి తీవ్ర నష్టం ఏర్పడింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా కూటమి ప్రభుత్వం చింతలపూడి ప్రాజెక్టును పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 2008లో అంకురార్పణ జరిగింది. మొత్తం రూ.1,701 కోట్ల బడ్జెట్ అంచనాలతో ఈ ప్రాజెక్టు పనులు మొదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 191 గ్రామాలకు తాగునీరు, 2.52 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పనులు ముందుగా సాగని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించే విధంగా ప్రణాళికలు తయారు చేసింది. పశ్చిమలో 15, కృష్ణాలో 18 మండలాలకు మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టును రూపుద్దిదారు. ఇందుకు రూ.4,909 కోట్లు బడ్జెట్ అంచనాలతో రూ.53.5 టిఎంసిల నీటిని తరలించే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. శరవేగంగా ప్రాజెక్టు పనులు కూడా సాగించారు. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగునీటి కోసం నానా తంటాలు పడుతున్న పరిస్థితి కొనసాగుతూనే ఉంది. జిల్లాల విభజనతో కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం ఏలూరు జిల్లాలో కలిసింది. గడిచిన ఎన్నికల్లో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. న్యూజివీడు ఎంఎల్ఎ మంత్రి కొలుసు పార్థసారధి సైతం నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీంతో మెట్ట ప్రాంత రైతులు చింతలపూడి ప్రాజెక్టు పూర్తిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గడిచిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై చూపించినంత శ్రద్ధ చింతలపూడిపై చూపించడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటివరకూ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే ముందుకు నడిచింది. నవంబర్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుంది. ఈ బడ్జెట్‌లోనైనా చింతలపూడి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ముందుకుసాగేలా చేస్తారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ప్రాజెక్టు పూర్తికావాలంటే ఈ బడ్జెట్‌లో కచ్చితంగా నిధులు కేటాయించాల్సి ఉంది. చింతలపూడి ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాల్సి ఉంది.

ఇప్పటికీ రైతులకు న్యాయం జరగని పరిస్థితి..

చింతలపూడి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగని పరస్థితి నెలకొంది. రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించిన పరిస్థితి ఉంది. బహిరంగ మార్కెట్లో ఎకరా పొలం రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతుండగా, ప్రభుత్వం మాత్రం రూ.12 లక్షల నుంచి రూ.19 లక్షలలోపే ఇస్తామంటూ భీష్మించుకుని కూర్చుంది. టిడిపి ప్రభుత్వం హయాం నుంచి రైతులు దీనిపై పోరాటం చేస్తున్నారు. తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. చెట్లకు, మోటార్లకు, ఇతర వాటికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. భూసేకరణ విషయంలో పాలకులు మొండిగా వ్యవహరించడం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామంటూ 2019 ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చినా గడిచిన ఐదేళ్లలో పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించి చింతలపూడి ప్రాజెక్టును పరుగులు పెట్టించాలని రైతులు కోరుతున్నారు.



ఉచిత ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి

ఉచిత ఇసుక అందించడమే లక్ష్యం
మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజలకు పారదర్శకంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుక సరఫరాకు నిర్దేశించిన ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. గురువారం మండలంలోని తమ్మిలేరు పరివాహక ప్రాంతమైన వలసపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. తొలుత మంత్రి కొలుసు పార్థసారధికి నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు ఐదేళ్ళ పాటు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేశారని, అంతటితో ఆగకుండా ఇసుక ధరలు పెంచి ప్రజలు, నిర్మాణదారులపై ఆర్థిక భారం మోపారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని, నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. అధిక వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో నదులన్నీ జలకళతో నిండిపోవడం వల్ల, దాంతో ఇసుక తీయడానికి ఆటంకాలు ఏర్పడి, కొంత అందుబాటులోకి రాలేదన్నారు. ఇటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఇప్పుడున్న రీచ్‌లతో పాటు రాష్ట్రంలో మరో 108 కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. తద్వారా ఇసుక సరఫరా పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. సీనరేజ్, డిఎంఎఫ్, మెరిట్ ఫీజులకు మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆ నష్టం భరిస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల టన్నుకు రూ.88 చెల్లించాల్సి ఉండేదని, దీన్ని రద్దు చేయడం వల్ల రూ.265 కోట్లు ప్రభుత్వంపై భారమైనప్పటికీ రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సొంతంగా లోడింగ్ కోసం లేబరు, ట్రాక్టర్లు వినియోగించుకొని ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదన్నారు. అయితే స్థానికంగా ఎప్పటి నుంచో ఇసుక లోడింగ్‌పై జీవనోపాధి చేసుకుంటున్న కార్మికులు లోడింగ్ ఛార్జీల కోసం రూ.400 కోరడం జరిగిందని, ఈ పనులపై ఆధారపడి ఉన్నారు కాబట్టి, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ స్థాయిలో కార్మికులకు లోడింగ్ ఛార్జి ఎంతమేర తగ్గించ కలిగే పరిస్థితి ఉందో పరిశీలించడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలకు అవసరమైన ఇసుకను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీన్ని ప్రభుత్వం ఒక బాధ్యతగా తీసుకుందని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉచిత ఇసుక విధానం పర్యవేక్షించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, మెదరమెట్ల సురేంద్ర, చలసాని దామోదరరావు, దేవినేని బలరామ్, మండలపు ధర్మరాజు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే నష్టపరిహారం
జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకూ నిర్మిస్తున్న జాతీయ రహదారి 365 (బిబి) విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే వారికి నష్టపరిహారం అందిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భూసేకరణపై జాతీయ రహదారి, రెవెన్యూ అధికారులు, భూ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి మండలంలోని రౌతుగూడెం, పి.అంకం పాలెం, బర్రింకలపాడు, తాటియాకులగూడెం గ్రామాలకు సంబంధించి భూ దస్త్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఐదు గ్రామాల పరిధిలో ప్రయివేటు భూమి 20 ఎకరాలు, గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఎకరం 50 సెంట్ల భూమి, మిగతా ప్రభుత్వ భూములు పడుతున్నాయని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో ఎవరైతే భూములు కోల్పోతున్న వారున్నారో అట్టివారికి నిబంధనల ప్రకారం ఎకరానికి రూ.15 లక్షల వరకూ చెల్లిస్తామని చెప్పారు. ఇంకా చెట్లు, షెడ్లు వంటి వేరే ఇతర ఫర్నీచర్‌కు కూడా పరిహారాన్ని అందించనున్నట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సేకరిస్తున్న భూముల్లో ఎల్‌టిఆర్ వివాదాలు, గిరిజన, గిరిజనేతర వివాదాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా చాలా వరకు భూముల్లో పట్టాదారుల్లో చనిపోయిన భూములు ఉన్నాయని అటువంటివారు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని వారికి సూచించారు. రైతులకు సంబంధించిన దస్త్రాల్లో తప్పులు దొర్లడంతో స్థానిక రెవెన్యూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. భూములకు సంబంధించిన ధ్రువ పత్రాలు సక్రమంగా ఉండేట్లు చూడాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్‌ను హెచ్చరించారు. మండలంలో ఇంకో సమావేశం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం జాతీయ రహదారి విస్తరణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే తహశీల్దార్ పోతురాజు, డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, డిటి సందీప్, హైవే, రెవెన్యూ సిబ్బంది, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

టార్గెట్ల పేరుతో ఒత్తిడి దారుణం
పోస్టాఫీస్ వద్ద నల్లబ్యాడ్జీలతో సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు పోస్టాఫీస్ వద్ద గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన 150 ఏళ్లుగా తరతరాలుగా పోస్టల్ సేవలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. సర్వర్ల కెపాసిటీ పెంచకుండా టార్గెట్ల పేరుతో తీవ్ర ఒత్తిడి తీసుకురావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మూడు లేదా నాలుగు గంటలు మాత్రమే విధులు నిర్వర్తించే గ్రామీణ డాక్ సేవక్‌లతో పది గంటల వరకూ వెట్టి చాకిరీ చేయించడం ఏంటని ప్రశ్నించారు. ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, తమ సమస్యల పరిష్కార సాధన కోసం అవిశ్రాంత పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వివిఎస్ అజరయ్య, ట్రెజరర్ జి.పార్థసారథి, అన్ని సబ్‌పోస్ట్ కార్యాలయాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న సిబ్బంది

బిసిలను అగ్రపథంలో నిలిపేందుకు కృషి
రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నా బిసిలంటూ కపట ప్రేమను చూపించి మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి వారినే మోసం చేశారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. బిసిలను అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఏలూరు చొదిమెళ్లలోని ఎంజెపి గురుకుల పాఠశాలను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటితో కలిసి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మంత్రి సవితకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా పాఠశాలతో పాటూ హాస్టల్ పరిసరాలను పరిశీలించిన ఆమె విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు. భోజన, వసతి సదుపాయాలకు సంబంధించి అందుబాటులో ఉన్న వనరుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ బిసిలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 107 గురుకుల పాఠశాలలుంటే అందులో 105 పాఠశాలలో టిడిపి హయాంలో ఏర్పాటు చేసినవేనన్నారు. గురుకుల పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.20 కోట్ల నిధులు కేటాయించారన్నారు. గత వైసిపి పాలనలో గురుకుల పాఠశాలలను భ్రష్టు పట్టించారన్నారు. బిసిల ద్రోహిగా మాజీ సిఎం జగన్ నిలిచిపోతారని ధ్వజమెత్తారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ చొదిమెళ్లలోని గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మాణం విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయంలో మంత్రి సవిత సానుకూలంగా స్పందించారని, స్థల సేకరణ చేపడితే నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని చెప్పారన్నారు. ఏలూరు సమీపంలో సుమారు పది ఎకరాల స్థలాన్ని సేకరించి గురుకుల పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ బడేటి చంటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, బిసి సంక్షేమ శాఖాధికారిని నాగరాణి, తహశీల్దార్ జివి.శేషగిరి, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవితకు స్వాగతం పలుకుతున్న ఎంఎల్ఎ, అధికారులు

అర్హులైన విఆర్‌ఒలను సీనియర్ అసిస్టెంట్లుగా నియమించాలి
రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు విఆర్‌ఎల సంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

154 జిఒ అమెండ్మెంట్ చేసి అర్హులైన విఆర్‌ఒలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా సీనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి.సిసోడియాను కలిసి వినతిపత్రం అందించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పిస్తూ జిఒ 166 ఇచ్చి సుమారు సంవత్సరంన్నర అవుతున్నప్పటికీ ఏ జిల్లాలో కూడా ఇంప్లిమెంట్ చేయలేదని, సుమారు 1200 గ్రేడ్-1 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు. మండలాల్లో గ్రేడ్-1 పోస్టులు చాలా ఖాళీలు ఉండడం వల్ల, ఇన్‌ఛార్జులతో పని చేయడంతో విఆర్‌ఒలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా ప్రమోషన్లు కల్పిస్తూ ఇచ్చిన జిఒ 166 అన్ని జిల్లాల్లో ఇంప్లిమెంట్ చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అనంతరం అర్హులైన విఆర్‌ఎలకు గ్రేడ్-2 విఆర్‌ఒలుగా అవకాశం కూడా కల్పించాలని కోరామని, అలాగే విఆర్‌ఒలకు బయోమెట్రిక్ విషయంలో జరుగుతున్న ఇబ్బందులను కూడా స్పెషల్ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించి తొందరలో విఆర్‌ఒల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందించేలా చర్యలు
జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అన్ని మౌలిక సదుపాయాలూ కల్పిస్తాం
ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించే దిశగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వైద్య సిబ్బంది కూడా అదే స్థాయిలో జవాబుదారీతనం, అంకితభావంతో వైద్య సేవలందించేలా పని చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆసుపత్రి వైద్యాధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల లోపం కారణంగా ఎటువంటి మరణం సంభవించకుండా డాక్టర్లు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుపై తాను దృష్టి సారించానని, ఇప్పటికే రూ.కోట్లతో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నానన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం ద్వారా ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రి ఆవరణలో రోగుల సహాయకులకు వెయిటింగ్ హాల్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో, ఆవరణలో, టాయిలెట్‌లలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రూపొందించే కార్యక్రమంలో భాగంగా 125 ఆధునిక బెడ్స్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ బి.పాల్‌సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.సుధాకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.శశిధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ఈ ఏడాది తగ్గిన నేరాల శాతం
దాదాపు 50 శాతం పెరిగిన రికవరీ
ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అక్టోబర్ నెల వరకు నేరాల శాతం తగ్గిందని, రికవరీ శాతం దాదాపు 50 శాతం పెరిగిందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించిన ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది మర్డర్ ఫర్ గెయిన్, డికాయిటీ, పగటి వేళ, రాత్రి వేళ దొంగతనాలు, రాబరీలు, ద్విచక్రవాహన చోరీలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో వైరు చోరీలు, గొలుసు దొంగతనాలు ఇలా మొత్తంగా గతేడాది జులై 15వ తేదీ నుంచి అక్టోబర్ 23వ తేదీ వరకు 192 కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో 82 కేసులు పోలీసులు చాకచక్యంగా ఛేదించారని చెప్పారు. 2024 జులై 15వ తేదీ నుంచి అక్టోబర్ 23వ తేదీ వరకు మొత్తంగా 264 కేసులు నమోదు కాగా వాటిలో 126 కేసులను పోలీసులు చాకచక్యంగా ఛేదించారని తెలిపారు. అంతేకాకుండా పక్క జిల్లాలకు సంబంధించిన పాత కేసుల్లో మన జిల్లాకు సంబంధం ఉన్న 149 కేసులను పోలీసులు ఛేదించారన్నారు. ఈ నేపథ్యంలో మొత్తంగా 275 కేసులు పోలీసులు ఛేదించారని చెప్పారు. మొత్తం 74 పాత కేసుల్లో మిగిలిన జిల్లాలకు చెందిన సొత్తును జిల్లా పోలీసులు రికవరీ చేసి ఆయా జిల్లాలకు అందించారని తెలిపారు. గతేడాది జులై నుంచి అక్టోబర్ వరకు నమోదైన 192 కేసుల్లో మొత్తం సొత్తు రూ.1,60,35,700 బాధితులు పోగొట్టుకోగా మొత్తం రూ.54,64,120 రికవరీ చేశారని తెలిపారు. ఈ రికవరీ శాతం 34గా నమోదైందన్నారు. కేసుల ఛేదన శాతం 43గా నమోదైందని తెలిపారు. మొత్తం 264 కేసుల్లో రూ.2,38,89,088 సొత్తు బాధితులు పోగొట్టుకోగా రూ.1,35,01,767 రికవరీ చేశామని, రికవరీ శాతం 57గా నమోదైందని తెలిపారు. అలాగే కేసుల ఛేదన శాతం 48గా నమోదైందని చెప్పారు. పక్క జిల్లాలకు చెందిన మొత్తం 74 కేసుల్లో రూ.47,52,000 సొత్తు బాధితులు పోగొట్టుకోగా రూ.44,80,000 రికవరీ చేసి పక్క జిల్లాలకు అందించారని, వీటి శాతం 94గా నమోదైందని తెలిపారు. పక్క జిల్లాలకు సంబంధించిన కేసులు మన జిల్లాకు సంబంధించిన కేసులు సంయుక్తంగా ఛేదించడం వల్ల వీటి శాతం 104గా నమోదైందని ఎస్‌పి తెలిపారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి
కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆదాయం కోసం మద్యాన్ని వరదలా పారించి లక్షలాది గీత కార్మికుల కుటుంబాల్లో కన్నీరు పెట్టించవద్దని, ఆదాయం కోసమే అయితే ఇంకా అనేక మార్గాలు ఉన్నాయని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా గీత కార్మికుల సమావేశం బెజవాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ వారం రోజుల్లోనే రాష్ట్రంలో 20 వేలకు పైగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిసినట్లు తెలుస్తుందన్నారు. వీటికి తోడు అక్రమ మద్యం పరవళ్ళు తొక్కితే కల్లు దుకాణాలు మూత పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో చంద్రబాబు ఎక్స్‌గ్రేషియో రద్దు చేసి, చెట్టు పన్ను రద్దు చేసి, రాష్ట్రంలో 50 వేలకు పైగా అక్రమ బెల్ట్ షాపులు పెట్టించి గీత వృత్తిని సంక్షోభంలో పడేశారన్నారు. గీత కార్మికులు అడగకుండానే కల్లు సొసైటీలకు బ్రాందీషాపులు ఇస్తామని ఆశలు కల్పించి కల్లు లేకుండా చేసి మద్యం అమ్మకాలు పెంచుకునేలా ప్రభుత్వం ఎత్తుగడ వేసిందన్నారు. మన పొరుగు రాష్ట్రాలు కల్లు గీతను అన్ని రకాలుగా ఆదుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కల్లు అనేది లేకుండా చేయాలనుకోవడం నాలుగు లక్షల గీత కుటుంబాలకు అన్యాయం చేయడమేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నూతన కల్లు పాలసీ ప్రకటించి వృత్తిలో ఉపాధి పెంచేలా చూడాలన్నారు. గీచేవానికే చెట్టుపై ఉన్న హక్కు యధావిధిగా అమలు చేయాలని, వృత్తిలో మరణించిన వారి కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియో, మరణించిన వారి దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయలైన వారికి వైద్య ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్క చంటి, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు, ఏలూరు సొసైటీ అధ్యక్షులు తోళం సత్యనారాయణ, పరసా పోతురాజు, మరీదు తులసీరావు, బెజవాడ మోహన్‌రావు, బెజవాడ సీతారామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

డిఇఒ అబ్రహం బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం విజయవాడ విద్యాశాఖ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. అలాగే ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా కమిషనరేట్ నుంచి ఎం.వెంకటలక్ష్మమ్మ రానున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంతర్జాతీయ లయన్స్ సంస్థ వారి ప్రతిష్టాత్మక క్వెస్ట్ కార్యక్రమంపై గురువారం ఏలూరులోని గ్రీన్ సిటీలో ఉన్న లయన్స్ డిస్ట్రిక్ట్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో, యువతలో మంచి మార్పు తీసుకురావడానికి, వ్యక్తిత్వ వికాసానికి కృషి చేసే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. క్వెస్ట్ ట్రైనర్ డాక్టర్ కె.లక్ష్మీమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక వికాసం, భావోద్వేగాలను నియంత్రించుకునేందుకు కుటుంబ బాంధవ్యాలను మెరుగుపరుచుకునేందుకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జింగిల్ బెల్స్ పాఠశాల, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. లయన్స్ జిల్లా క్వెస్ట్ చైర్మన్ డి.సురేష్ అధ్యక్షత వహించిన ఈ ప్రోగ్రాంలో లయన్స్ జిల్లా పిఆర్‌ఒ ఎం.శ్రీహరి, వి.రామారావు, ఎల్.వెంకటేశ్వరరావు, రీజియన్ చైర్మన్ ఎం.కృష్ణమోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ డి.సరస్వతి, పాఠశాల ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థులు డిగ్రీ చదువులతో పాటు వృత్తి విద్య నైపుణ్యాలను అందిపుచ్చుకుని క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు అన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం సెట్‌వెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 80 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా 11 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఎల్‌ఎ అభినందించారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - చాట్రాయి

యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు మండలంలోని సి.గుడిపాడు జెడ్‌హెచ్ స్కూల్లో గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా వచ్చిన జిల్లా కార్యదర్శి బి.అనూరాధ మాట్లాడుతూ ఎన్నికైన నూతన కార్యవర్గం సంఘ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని, మండలంలోని యుటిఎఫ్ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. జనవరిలో కాకినాడలో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా ఆడిట్ సభ్యుడు కె.గంగాధరుడు సంవత్సరిక ఆర్థిక తనిఖీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వంతాని వీరబోస్ మాట్లాడుతూ జిల్లా శాఖ సహకారంతో చాట్రాయి మండలంలో అనేక ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. సకాలంలో డిఎలు ఇవ్వాలని, పిఆర్‌సి ఇవ్వాలని కోరారు. యుటిఎఫ్ మండల నాయకులు సత్యనారాయణ రెడ్డి ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం బదిలీలు నిర్వహించాలని, సిపిఎస్ 117 జిఒను రద్దు చేయాలని తీర్మానాలు చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సీతారాం ఏచూరి, రామోజీరావు, రతన్ టాటా మృతికి సంతాపం తెలిపారు. యుటిఎఫ్ మండలాధ్యక్షులుగా కె.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.రాఘవ, గౌరవాధ్యక్షులుగా జరపల చంటి, సహాధ్యక్షులుగా వాణి మాధవి, జి.వెంకట్రావు, ట్రెజరర్‌గా జి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా వి.హరీష్, స్వర్ణకుమారి, బి.వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా పెద రమేష్ ఎన్నికయ్యారు.

భూములను గిరిజనులకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎడవల్లి, గుయ్యాల, ప్రభుత్వ పోరంబోకు భూములను స్థానిక గిరిజనులకు పంచాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ కోరారు. స్థానిక జైనవారిగూడెం మహిళా సమైక్య భవనంలో సీతారామనగరం గ్రామ రెవెన్యూ సంబంధించిన రెవెన్యూ గ్రామసభకు తహశీల్దార్ పివి.చలపతిరావు, పంచాయతీ సర్పంచి తాటి సీత, రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పిడకప్పగూడెం, జైనవారిగూడెం గ్రామాల్లో ఉన్న గిరిజనులు భూసమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జైనవారిగూడెం రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూమి చట్టబద్ధంగా స్థానిక ఇనుమూరు గిరిజనులకు పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. గిరిజనేతరులు అనుభవిస్తున్న ఆ భూముల రికార్డులు ట్రైబల్ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజనులతో మండల కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం భాస్కర్, నాయకులు జోడే సూర్యచంద్రరావు, అన్నపూర్ణ, శ్రీనివాసరావు, ఎం.రాజు, తాటి సీత, దుర్గమ్మ, కృష్ణ, దాడి వెంకటలక్ష్మి, కొవ్వాసు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

యర్రమిల్లిపాడులో వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

పిఎంపి అసోసియేషన్ ఉంగుటూరు మండల శాఖ, గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యర్రమిల్లిపాడులో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని చేబ్రోలు ఎస్‌ఐ సూర్యభగవాన్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మండవల్లి :సమాజానికి భద్రత కల్పించడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ అన్నారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లిలో గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే క్రమంలో ఎంతో మంది పోలీసులు అమరులయ్యారన్నారు. అనంతరం స్థానిక ప్రధాన సెంటర్ నుంచి స్టేషన్ రోడ్డు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామచంద్రరావు, ఎఎస్‌ఐ కొక్కొల్లు రాజు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అపరాల సాగులో మెలకువలు పాటించాలి

మండవల్లి :అపరాల సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటమణి తెలిపారు. మండలంలోని పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రబీలో వేయబోయే అపరాల సాగులో అధికారుల సూచనలను సలహాలు తప్పనిసరిగా పాటిస్తే మంచి లాభాలు ఉంటాయన్నారు. ప్రతి మంగళవారం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల అధికారులు రైతులకు అందించే పథకాలు రైతులకు అవగాహన కలిగిస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయ రంగంలోని స్కీములను రైతులకు వివరించారు. మినుము మినీ కిట్లను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెదమాల్ల పద్మ, టిడిపి నాయకులు రాంబాబు, వెంకన్న, ఏఎఒ గోపాల్ చౌహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఫిషరీస్ అసిస్టెంట్ భవాని, పుల్లయ్య, వెటర్నరీ అసిస్టెంట్ భవాని, రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామ శివారులో పేకాట నిర్వహిసున్నారన్న సమాచారం మేరకు ఆయన తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,79,500 నగదును, నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

కామవరపుకోట :అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తడికలపూడి, కళ్లచెరువు, కెఎస్.రామవరం, జీలకర్రగూడెం గ్రామాల్లో ఎక్సైజ్ సిఐ అశోక్ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో మద్యం అమ్ముతున్న నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పశుగణన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

21వ పశుగణన ఈ నెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్లు, బ్రోచర్లు, స్టిక్కర్లు మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణనకు రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :మండల వ్యాప్తంగా నేటి నుంచి 21వ అఖిల భారత పశు గణన ప్రక్రియ ప్రారంభించనున్నట్లు జీలుగుమిల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎం.సాయిబుచ్చారావు తెలిపారు. పశువులకు ఆహార భద్రత కల్పించటలో, పశువులకు పలు రకాల పథకాలు అమలు చేయడానికి పశుగణన ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మండలంలోని రైతు సోదరులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పెండింగ్ జీతాల కోసం ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఎపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ప్రతి నెలా ఇవ్వాలన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించడం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రామసింగవరం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరులో గురువారం జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లా త్రో బాల్ ఎంపికల్లో పెదవేగి మండలం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ రామసింగవరం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన సిహెచ్.దివ్యశ్రీ, పి.వంశీసాయి, పి.లక్ష్మీపావని అండర్-17 విభాగంలో, టి.దిలీప్, కె.రాజశ్రీ అండర్-14 విభాగంలో ఎంపికయ్యారు. వీరిని ఎంఇఒ సిహెచ్.బుధవాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి అభినందనలు తెలిపారు.

కృత్రిమ అవయవాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పుట్టుకతో గాని ప్రమాదవశాత్తూ గాని శరీర అవయవాలు కోల్పోయి వికలాంగులుగా మారిన వారి జీవితాల్లో నూతన వెలుగులు నింపడానికి ఉచితంగా కృత్రిమ కాళ్లను అందించడానికి దాతలు వితరణగా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్ అన్నారు. తోటపల్లి కృత్రిమ అవయవ కేంద్రంలో దాతలు కాకర్ల శంకరరావు, వల్లూరి తాతారావు, రాజ్యలక్ష్మి, దోనేపూడి రాధిక అందించిన ఆర్థిక సాయంతో ఏలూరుకు చెందిన సిహెచ్.బాబూరావు, అత్తిలికి చెందిన పి.శ్రీనివాసరావు, మచిలీపట్నానికి చెందిన ఎ.ఏసుబాబు, వెన్నూతలకు చెందిన ఎన్.సత్యనారాయణ, కొండపావులూరుకు చెందిన పి.సుశీలమ్మలకు కృత్రిమ కాళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫోర్డ్ యూనివర్శిటీ ప్రతినిధులు బృందం, హీల్ సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, హీల్ యుకె ప్రతినిధి జూలీ, పిన్నమనేని సిద్దార్థ మెడికల్, సైన్సెస్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ సి.మాధవరావు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం వాయిదా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆరు చేపల చెరువులకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ బహిరంగ వేలం పాటలో ఎవరూ పాట పాడేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో వేలంపాటను వాయిదా వేసినట్లు కార్యదర్శి జి.రమేష్ తెలిపారు. తదుపరి నిర్వహించే బహిరంగ వేలం పాటను త్వరలో ప్రకటిస్తామన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్స్‌పై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కలిదిండి

ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆంధ్రా తెలంగాణా రాధా రంగా మిత్ర మండలి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పన్నాస పూర్ణచంద్రరావు (కాళ్లపాలెం బుజ్జి) అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే విధంగానే ప్రయివేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో వెన్నెల మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెన్నెల తండ్రి బాబిని కలిసి అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా రామ్మూర్తి పుట్టినరోజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి పుట్టినరోజు వేడుకలను గురువారం ఆయన నివాస స్థలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయవరపు చేతుల మీదుగా కేకు కట్ చేశారు. పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలవరం మాజీ ఎంఎల్‌ఎ ఎం.శ్రీనివాసరావు, టిడిపి మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముదినేపల్లి :రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పురుగులను, తెగుళ్లను అరికట్టుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బొర్రా వేణుమాధవ్ అన్నారు. మండలంలోని కోడూరు, పెదపాలపర్రు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వేణుమాధవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి క్రాంతికుమార్, మండల ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్, కోడూరు, పెదపాలపర్రు సర్పంచులు గంటా రాకేష్ కుమార్, అడుసుమిల్లి వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

మరొక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

పోలవరం నియోజకవర్గంలో మరొక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో రూ.రెండు వేల కోట్లతో నౌకాదళ ఆయుధాగారం ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖంగా ఉందని తెలిపారు. పోలవరం నియోజకవర్గం పరిధిలోని బుట్టాయగూడెం మండలంలోని ఇప్పలపాడు ఏకలవ్య మోడ్రన్ రెసిడెన్షియల్ స్కూలును పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి విద్యా బోధన, వసతి సౌకర్యాల గురించి ఆరా తీశారు. సరైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి పాఠశాలలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ నేవీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం స్థల పరిశీలన జరుగుతుందని త్వరలోనే కార్యరూపం దాల్చుతుందని తెలిపారు. కోకో, ఆక్వా రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడిని కలిసి వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.నాయుడు, ఏకలవ్య స్కూల్ కమిటీ ఛైర్మన్ రవ్వ నాగేశ్వరరావు, వైస్ ఛైర్‌పర్సన్ తెల్లం నాగమణి, జనసేన నాయకులు కరాటం సాయి చంద్రమోహన్, టిడిపి నాయకులు మనెల్లి బాలు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారిపై పోలీస్ శాఖ వారు కఠిన చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ సూచించారు. హెల్మెట్ ధారణ- మన ప్రాణాలకు రక్షణ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు బుర్రకథ ద్వారా బోసుబొమ్మ సెంటర్ వద్ద గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ లేకపోతే జరిమానాలు తీవ్రంగా ఉంటాయని వాహనదారులను హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకుని ప్రయాణించమని చెప్పేది, మా కోసం కాదని మీ కుటుంబాల కోసమన్నారు. ప్రాణం చాలా విలువైనదాని, దాని కాపాడుకోవాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని కోరారు. మద్యం తాగి వాహనలు నడపరాదన్నారు. అతివేగంతో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. రోడ్డు ప్రమాదంలో కాలు, చెయ్యి విరిగితే జీవితాంతం ఇబ్బందులు పడాలని, ఒక్కసారి మీ కుటుంబం గురించి ఆలోచించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపకూడదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోంగ్రు దేవ, టిడిపి పట్టణ నాయకులు తాటి అప్పారావు, తాటి సింహ, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన తాత్కాలిక వాయిదా

సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ హామీ

త్వరలోనే బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కాంట్రాక్టర్



కార్మికులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల నిరసన గురువారంతో ఐదో రోజుకి చేరుకుంది. ఐదు నెలల పెండింగ్ జీతాలు, పిఎఫ్, ఇఎస్‌ఐలను విడుదల చేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి వీరిని పర్మినెంట్ చేయాలని గంట సేపు నిరసన తెలిపి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ చింతలపూడి మండల కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కమిటీ సభ్యులు బి.వజ్రం, ఎస్‌కె.జాని మద్దతు తెలిపారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో మళ్లీ తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీకి రెండు నెలల జీతాలు, వచ్చే నెల 18కి పిఎఫ్, ఇఎస్‌ఐ బకాయిలు విడుదల చేస్తామని కాంట్రాక్టర్ ఇచ్చిన లిఖితపూర్వక హామీ మేరకు ఈ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదో రోజు నిరసనలో ది మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎఐటియుసి అనుబంధం చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తుర్లపాటి మరియమ్మ, తిరుమలశెట్టి రాము, కూరపాటి నాగరాజు, కోడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, గొర్రె దేవమణి, బుద్ధవరపు వెంకట్రావు, ఇసుకలోటి వాణి పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

జల జీవన్ మిషన్ అభివృద్ధి నిధులతో పాత పరింపూడి గ్రామంలో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచి ముప్పిడి విజయకుమారి మాట్లాడుతూ రూ.1.26 కోట్లతో తాగునీటి వనరుల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన జలజీవన్ మిషన్ నిధుల ద్వారా కొత్త పరింపూడి ఎస్‌టి ఏరియాలో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మిస్తామని చెప్పారు. దాని నుంచి పాత పరింపూడి వరకు పైపులైన్ నిర్మాణం చేపట్టి స్థానికులకు ఉచితంగా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సత్యసాయి నగర్‌లో మరొక తాగునీటి వాటర్ ట్యాంక్ జలజీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి సంకుకొండ, ఇఒ కంపా సురేష్, రామకృష్ణ, వూసల రాజేష్, మాదేపల్లి శ్రీను, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జిటి ఎయిడెడ్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బుట్టాయిగూడెం మండలంలోని బుసరాజుపల్లిలో ఉన్న పిఎంకె ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్‌జిటి ఎయిడెడ్ టీచర్ పోస్టు భర్తీకి ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మెమో జారీ చేసిన నేపథ్యంలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈ నెల 29వ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలు (అకడమిక్, ప్రొఫెషనల్) ఫొటో కాపీలతో పాఠశాల కరస్పాండెంట్‌కు వ్యక్తిగతంగా కాని, పోస్ట్ ద్వారా కాని, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కాని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఎఐటియుసి భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిందని జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోటదిబ్బ ఎస్‌ఆర్ వన్ వద్ద ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం పోస్టర్లను ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను వీడనాడాలని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి పోరాడుతుందని తెలిపారు. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేదీ గురువారం ఉదయం 8:30 గంటలకు ఏలూరు హెడ్ వాటర్ వర్క్స్ పంపుల చెరువు వద్ద పతాకావిష్కరణ సభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉద్యోగ సిబ్బంది అంతా పాల్గొనాలని ఆయన కోరారు. గత 105 సంవత్సరాలుగా భారతదేశ కార్మిక వర్గానికి, ఉద్యోగ వర్గానికి అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా 44 కేంద్ర కార్మిక చట్టాలను సాధించిన ఘనత ఎఐటియుసికి ఉందన్నారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.భరత్ లోమి, ఎస్ఎంవి.సుబ్బారావు, ఎస్‌కె.అలీ, బికె.దుర్గారావు, ఎం.ఆదినారాయణ, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలను, సిబ్బంది హాజరును, మెనూ స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థుల చదువు వివరాలను, వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులకు కనీస అవసరాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

బిఆర్‌డి స్కూల్‌లో ప్రపంచ పోలియో దినోత్సవం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలోని మారుమూల ప్రాంతాలకు ర్యాలీగా వెళ్లి గ్రామస్తులకు పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. కృష్ణుడి ఆలయం వద్ద విద్యార్థులు మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో సంవత్సరం చదువుతున్న సిరి పోలియో దినోత్సవం గురించి వివరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి పశువులకు నట్టల నివారణ మందు

ప్రజాశక్తి - ముసునూరు

మూగ జీవాలకు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నట్టల నివారణ మందు వేస్తున్నట్లు టిడిపి సూరేపల్లి గ్రామ అధ్యక్షులు మల్లిబాబు తెలిపారు. మండలంలోని సూరేపల్లిలో 1478 గొర్రెలకు, 150 మేకలకు నట్టల నివారణ మందు పశు సంవర్ధక శాఖకు సంబంధించిన వైద్యాధికారి ఎం.వెంకటచైతన్య, మధుల ఆధ్వర్యంలో ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో వేంపాటి శ్రీనివాసరావు, వేంపాటి సత్యనారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పట్టిసీమలో దాకే అభిమన్యుడు వర్ధంతి

ప్రజాశక్తి - పోలవరం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి, పేద ప్రజల ఆశాజ్యోతి దాకే అభిమన్యుడని రాష్ట్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. పట్టిసీమలో యామిని కళ్యాణ మండపంలో దాకే అభిమన్యుడు ఫౌండషన్ ఛైర్మన్ దాకే సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో దాకే అభిమన్యుడు 17వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పట్టిసీమలో దాకే అభిమన్యుని విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ, పట్టిసీమలో పాఠశాలలకు బల్లలు, కుర్చీలు బహుకరించారు.

రీసర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రీసర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ఆయా గ్రామాల్లో నిర్వహించే రీసర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని కలటూరులో గురువారం నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ గ్రామసభలో రైతుల భూ సమస్యలకు సంబంధించి 91 అర్జీలను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మరియన్న, మండల సర్వేయర్ గంగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యూనస్, గ్రామ విఆర్‌ఒ రవిశేఖర్, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

టి.నరసాపురం :రీసర్వే గ్రామసభకు 33 దరఖాస్తులు అందాయని, ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. మండలంలోని వంద రామన్నపాలెంలో గురువారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా భూమి ఆన్‌లైన్, పేర్లు మార్పు, భూ విస్తీర్ణం సరి చేయాలని కోరుతూ పలువురు ఫిర్యాదు చేశారన్నారు. మొత్తం 33 ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిఎస్.పవన్‌కుమార్, డిటి.స్రవంతి, విఆర్‌ఒ బోస్, ఎస్‌కె.వలీ, ఎల్లిన సురేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే గ్రామసభలు ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని దేవపూడి, ప్రొద్దువాక, కొరగుంటపాలెం గ్రామాల్లో గురువారం తహశీల్దార్ ఆధ్వర్యంలో రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో రైతులు వద్ద నుంచి 46 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ తెలిపారు.

నల్లమాడులో అవకతవకలు జరగలేదని నిర్ధారణ

ఉంగుటూరు :నల్లమాడు పంచాయతీలో 2013 - 2019లో అప్పటి సర్పంచి కండెపు అరుణకుమారి హయాంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అధికారుల విచారణలో రూ.2,37,248తో చేసిన పనులకు సంబంధించి కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల ఎంబుక్‌లు, ఇతర ఆధారాలు కనిపించకపోవడంతో నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. దరిమిలా రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం మాజీ సర్పంచి నుంచి రికవరీ చేయమని జిల్లా అధికారులు 2022లో ఉత్తర్వులు ఇచ్చారు. అయితే పంచాయతీ కార్యదర్శులు బదిలీలు జరిగిన అనంతరం ఎంబుక్స్, (మెజర్‌మెంట్ బుక్స్) ఇతర ప్రొసీడింగ్స్ రికార్డులు దొరికాయి. వాటిని తిరిగి ఉన్నతాధికారులకు నివేదించగా విచారణలో ఎలాంటి అవకతవకలు జరగలేదని చేసిన అభివృద్ధి పనులకు, ఖర్చుపెట్టిన వాటికి ఎంబుక్‌లో రికార్డు అయిన వాటికి లెక్కలు సరిపోవడంతో మాజీ సర్పంచి అరుణకుమారి నుంచి ఆర్‌ఆర్ యాక్టు రికవరీ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ రద్దు చేస్తూ ఈ నెల 21న రిమూవ్ ఆర్‌ఆర్ యాక్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు మండల పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర్ తెలిపారు.